క్లుప్తంగా

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గౌరవం ఉందని ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఎస్టీయూ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కాకుమాను జోజప్ప, యూనియన్ నాయకులు బి.సురేష్‌బాబు, తాడేపల్లి మండల అధ్యక్షులు అజయ్‌రెడ్డి, ముస్తఫా పాల్గొన్నారు.

జాతీయ స్థాయి డాన్స్ పోటీలకు శృతి ఎంపిక



తాడేపల్లిరూరల్: జాతీయ స్థాయి డాన్స్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థిని కాకర్లపూడి శృతి సమన్వి ఎంపికైంది. వర్సిటీ డీన్ డాక్టర్ సిహెచ్.హనుమంతరావు బుధవారం వివరాలు వెల్లడించారు. బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శృతి, సాక్‌లోని డాన్స్ క్లబ్‌లో క్రియాశీలక సభ్యురాలు, ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ 2023–24లో క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ఆమె జాతీయ స్థాయిలో 2వ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. ఈసంవత్సరం మార్చిలో లూధియానాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శృతి సమన్విని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు అభినందించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం తుమ్మపూడిలో జగనన్న కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు, సర్పంచి షేక్ అజీజూన్, వైస్ ప్రిన్సిపాల్ వై.పూర్ణచంద్రరావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

మేడికొండూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన గర్భిణులకు హెల్ప్ ఫౌండేషన్ అమ్మ కోసం కార్యక్రమం పేరుతో పౌష్టికాహారం అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు పి.అనిరుథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు శ్రీలత సాంబశివరావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ మురుగుడు, పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి



చినకాకానిలో వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్క పేద కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించి ప్రభుత్వం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలను ప్రభుత్వ వైద్యులు అందిస్తున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని చినకాకాని తాతయ్య కల్యాణ మండపం, మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద రాజా వాసిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లతో కలసి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన వారిని పరామర్శించి ఉచిత కళ్లజోళ్లను, మందులను ఆరోగ్య కిట్లను అందజేశారు. ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్యరంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయని, ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే భయపడే ప్రజలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ వైద్యశాలకు క్యూ కడుతున్నారని చెప్పారు. ఏ అర్బన్ హెల్త్ సెంటర్‌లో చూసిన ప్రతిరోజు ఓపీ 100 నుంచి 120 వరకు ఉంటోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, తోట శ్రీనివాసరావు, ఉన్నంశెట్టి విజయ్, బేతపూడి నరసయ్య, కల్యాణ్, మహేష్, గండికోట హేమంత్‌కుమార్, రామకృష్ణారెడ్డి, రమణ, వల్లంశెట్టి విజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుంది

ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్ నగర్ అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ మానస, వైద్య సిబ్బందితో కలసి దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఎంతో బాగుంటుందని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఎంటీఎంసీ పరిధిలో తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆప్టో ఎలక్ట్రానిక్స్‌పై అధ్యయనాలు అవసరం

డాక్టర్ నారాయణరావు



భౌతిక శాస్త్ర రంగంలో ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తాడేపల్లిరూరల్: ఎల్‌ఈడీ బల్బుల తయారీపై ఇంకా లోతైన అధ్యయనాలు జరగాల్సి ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ డి.నారాయణరావు పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయనతో పాటు ఐఐటీ ఢిల్లీ నుంచి డాక్టర్ విజయప్రకాష్, నేషనల్ ఫిజికల్ లాబొరేటరి, సీఎస్‌ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆచంట వేణుగోపాలత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ కాంతి పదార్థాల తయారీలో ఉన్నత స్థాయి పరిశోధనలు జరగాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న భౌతిక శాస్త్రవేత్తలు ప్రచురించిన పరిశోధనా పత్రాలను కూర్పు చేసి తయారు చేసి ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సుకు డీఎస్టిసెర్బ్ ఆర్థిక సహకారం అందించినట్లు కేఎల్‌యూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న తెలిపారు. మైక్రో యాంటీనాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తారీలో నానో పాస్పర్స్ మరియు మెటా పదార్థాలు ఎంతోగానో ఉపయోగపడతాయని ఐఐటీ ఢిల్లీ డాక్టర్ విజయ ప్రకాష్ అన్నారు. సదస్సులో పాల్గొన్న వారందరికీ భౌతిక శాస్త్ర పరిశోధనలో ఉన్న ఆవశ్యకతను, భౌతిక శాస్త్రానికి సంబంధించి ప్రభుత్వ రంగంలో ఉన్న వకాశాలను గురించి నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ సీఎస్‌ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆచంట వేణుగోపాల్ వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, కో ఆర్డినేటర్ డాక్టర్ శివగంగ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, కన్వీనర్ డాక్టర్ మహమూదాషేక్, పరిశోధనల అదనపు డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, వరంగల్ ఎన్‌ఐటీ నుంచి డాక్టర్ హరనాథ్, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషా చరిత్ర ఎంతో గొప్పది

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో హిందీ భాషకు ఘనమైన చరిత్ర ఉందని ప్రభుత్వ మహిళా కళాశాల హిందీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ కె.విజయకుమారి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విశ్వహిందీ దివస్ సందర్భంగా అతిథి ఉపన్యాసం జరిగింది. ఈసందర్భంగా కళాశాల హిందీ శాఖాధ్యక్షుడు డాక్టర్ గుడిపూడి విజయరత్న కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో విజయకుమారి మాట్లాడుతూ హిందీ భాషా చరిత్ర ఎంతో విశేషమైనదని, ఎందరెందరో గొప్ప కవులు హిందీ సాహిత్యాన్ని విస్తృత పరిచారని తెలిపారు. హిందీ భాష చరిత్రను విద్యార్థులు తప్పక తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, అధ్యాపకులు షేక్బాజీ, షేక్ హసీనా, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో సెయింట్స్ ఆన్స్ క్రీడాకారుల ప్రతిభ



ఫిరంగిపురం: త్రోబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. గుంటూరు రూరల్ నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూల్‌లో డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా గతనెలలో ఇంటర్ స్కూల్ కాంపిటేషన్ త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కాగా పోటీల్లో ఫిరంగిపురం సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభచూపి ట్రోఫీ, మెడల్స్ సాధించారు. బుధవారం పాఠశాలలో ట్రోఫీ, మెడల్స్‌ను లయోలా పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంతోని, ప్రిన్సిపాల్ ఫాదర్ సురేష్ అందజేశారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎం సిస్టర్ ఒట్టి, థెరసమ్మ, పీఈటీలు నిర్మలమేరి, శిల్ప, ఉపాధ్యాయుడు ఇన్నారెడ్డి పాల్గొన్నారు. ట్రోఫీ సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నపరెడ్డి, అంజిరెడ్డి అభినందించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుజ్జనగుండ్లలో నివాస ఉండే ఓ కుటుంబానికి చెందిన పది సంవత్సరాల బాలికతో పక్కనే నివాసం ఉండే 50 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మంగళవారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక అతని నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే నిందితుడు తనకు, బాలిక తల్లిదండ్రులకు మధ్య స్థల వివాదం ఉందని, ఈనేపథ్యంలోనే వారు బాలిక చేత తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు గుర్తింపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి



తాడికొండలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి సుధాకర్

తాడేపల్లిరూరల్: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులను గుర్తించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో స్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించే విధంగా ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలు నిర్వహిస్తున్నారని, ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో 83 సచివాలయాల పరిధిలో మొదటి విడత ఆటల పోటీలను నిర్వహించారని, రెండో విడతలో ఆడేవారు మండల స్థాయికి ఎంపికయ్యారని, నియోజకవర్గ వ్యాప్తంగా ఎంటీఎంసీ పరిధిలో 4 గ్రౌండ్‌లు, దుగ్గిరాల పరిధిలో మరో మూడు గ్రౌండ్‌లలో ఈ పోటీలు జరుగుతున్నాయని వివరించారు.

కార్యక్రమంలో ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, తోట శ్రీనివాసరావు, ఉన్నంశెట్టి విజయ్, బేతపూడి నరసయ్య, కల్యాణ్, మహేష్, గండికోట హేమంత్‌కుమార్, రామకష్ణారెడ్డి, రమణ, వల్లంశెట్టి విజయ్ పాల్గొన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో మండల స్థాయి క్రీడలను ఎంపీడీఓ డి.వీరయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

క్రీడాకారులను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా

తాడికొండ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తాడికొండ మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ దొడ్డా సుధాకర్ అన్నారు. బుధవారం తాడికొండ సత్యసాయి హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఎంపీడీఓ అత్తోట దీప్తితో కలసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

తుళ్లూరు మండలంలో....

తుళ్లూరు మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఎంపీడీఓ బి.శివన్నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

ఫిరంగిపురం: శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాల స్టేడియం, సెయింట్‌పాల్స్ పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని అత్యంత ప్రతిభను చూపాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మందాల వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, మేడాబాబు, పి.జేమ్స్ ఇన్నయ్య, జి.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పాలడుగులో..

మేడికొండూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండల పరిధిలోని పాలడుగులో మండల స్థాయి పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీలను ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకరరావు, తహసీల్దారు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

మాల దాసుల గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షణ చేస్తున్న మాలదాసులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రం నుం- విజయవాడ ఇంద్రకీలాద్రి వరకు మాలదాసుల గిరిప్రదక్షిణ కార్యక్రమం కృష్ణ ధర్మరక్షణ సంస్థ ఆధ్వర్యంలోబుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో అహోబిల రామానుజ జీయర్‌స్వామి అమృత హస్తాలతో మాలదాసుల ఆత్మ గౌరవార్థం మాలదాసుల గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 3,500 మంది పాలుపంచుకున్నారని తెలిపారు. హరిదాసుల వేషధారణలో కోలాటాల బృందాల మధ్య ఈ గిరి ప్రదక్షిణ విజయకీలాద్రి నుంచి ప్రారంభమై ప్రకాశం బ్యారేజ్ మీదుగా ఇంద్రకీలాద్రి అమ్మవారి గిరి ప్రదక్షిణతో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కెల్లా దుర్గారావు, తాళ్లూరి పవన్, శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో హ్యాండ్లూమ్ వాక్




చేనేత వస్త్రాలను ధరించి హ్యాండ్లూమ్ వాక్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో చేనేతకు చేయూతలో భాగంగా హ్యాండ్లూమ్ వాక్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హ్యాండ్లూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వనజ మాట్లాడుతూ చేనేత కళ ఎంతో ప్రాచీన కళ అని, అంతరించిపోయే దశలో ఉన్న చేనేతను బతికించుకోవాల్సిన అవసరముందన్నారు. ఈసందర్భంగా వారంలో ఒక రోజు కళాశాలలో చేనేత వస్త్రాలను ధరించేందుకు అంగీకరించిన కళాశాల ప్రిన్సిపాల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చేనేత వస్త్రాలను ధరించి హ్యాండ్లూమ్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కళాశాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ డాక్టర్ ధాత్రికుమారి, స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ సుబ్బరత్నం, సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదిలోనే గుర్తిస్తే సర్వైవ్ కావొచ్చు!

- సర్వైకల్ క్యాన్సర్ నివారణకు అందుబాటులో వ్యాక్సిన్
- మహిళలకు వ్యాధిపై అవగాహన అవసరం
- అవగాహన లేమితో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- ఇది గర్భాశయ క్యాన్సర్ అవగాహన నెల



గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పోస్టర్లు

గుంటూరు మెడికల్: క్యాన్సర్ సోకితే చనిపోతారనే భయం ప్రజల్లో నేటికీ చాలా మందిలో ఉంది. కానీ కొన్ని రకాల క్యాన్సర్‌లు రాకుండా ముందస్తుగానే వ్యాక్సిన్‌ల ద్వారా నివారించవచ్చు. ఈవిషయంపై అనేక మందికి అవగాహన లేకపోవడంతో క్యాన్సర్ వ్యాధి బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అలాంటి వాటిల్లో గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్) క్యాన్సర్ ఒకటి. మనదేశంలో ప్రతి ఏడాది మూడు లక్షల మంది మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారు. వారిలో 1.25 లక్షల మంది చనిపోతున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్న వారిలో గ్రామీణ ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే క్యాన్సర్‌లలో గర్భాశయ క్యాన్సర్‌లది నాల్గో స్థానం. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి రోజు 150 మంది వివిధ రకాల క్యాన్సర్లతో చికిత్స కోసం వస్తున్నారు. వారిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు ఇద్దరు ఉంటున్నారు. ఈవ్యాధిని ముందస్తుగానే గుర్తించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చు. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా ప్రజలకు జాగ్రత్తలు వివరించేందుకు ప్రతి ఏడాది జనవరి నెలను గర్భాశయ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు..

గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించలేరు. రుతుక్రమ సమయంలో, లేదా లైంగిక సంభోగం తరువాత అసాధారణంగా యోని నుంచి రక్తస్రావం జరుగుతోంది. నడుము నొప్పి, కాళ్లు నొప్పి, కాళ్లవాపు, అలసట, బరువు తగ్గుదల, ఆకలి తగ్గుట, చెడు వాసనతో కూడిన యోని స్రావాలు కారడం, యోనిలో గడ్డలు, శృంగార సమయంలో నొప్పి, యోనిలో అసౌకర్యం, యోని నుంచి మలం రావడం, తదితర లక్షణాలు ఉంటాయి.

కారణాలు..

హ్యూమన్ పాపిల్లోమ వైరస్ (హెచ్‌పీవీ) వల్ల ఈ వ్యాధి వస్తుంది. సంపర్కం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సంభవిస్తుంది. ఐదు సంవత్సరాలకన్న ఎక్కువ సమయం గర్భనిరోధక మాత్రలు వాడడం, తక్కువ వయస్సులోనే ముగ్గురికిపైగా పిల్లలకు జన్మనివ్వడం, ధూమపానం, 18 సంవత్సరాల కంటే ముందే లైంగిక సంబంధం కలిగి ఉండటం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం తదితర కారణాలతో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకుతోంది. భాగస్వామితో కాకుండా ఇతరులతో లైంగిక సంబంధాలు కలిగి ఉన్నవారికి కూడా ఇది సోకుతోంది.

రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలి...



వ్యాధి లక్షణాలు ప్రారంభంలో కనిపించవు. తొలి దశలోనే గుర్తిస్తే 95 శాతం పూర్తిగా నయం చేయవచ్చు. హై రిస్క్ గ్రూపునకు చెందిన మహిళలు ముందస్తుగా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. 30 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు కనీసం ఏడాది కొకసారైనా గైనకాలజిస్టులను సంప్రదించి రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో చెక్



9 నుంచి 12 ఏళ్ల మధ్య వయస్సు వారు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ చేయించుకోవాలి. ఆ వయస్సులో చేయించకపోతే కనీసం 20 ఏళ్లలోపు చేయించాలి. రెండు మోతాదుల్లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. టీకాలు చాలా సురక్షితమైనవి. మహిళలకు వ్యాధిపై అవగాహన లేకపోవడం వల్ల ముఖ్యంగా టీకా అందుబాటులో ఉందనే విషయం తెలియక పలువురు వ్యాధి బారిన పడుతున్నారు.

– డాక్టర్ భైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్లు...



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌కు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. మహిళలకు సోకే క్యాన్సర్‌లలో 25శాతం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లే ఉన్నాయి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయించటం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఆపరేషన్ అనంతరం చేసే రేడియేషన్ చికిత్స, కీమోథెరపీ కూడా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు. అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు నేడు అందుబాటులో ఉండటం ద్వారా చాలా సులువుగా క్యాన్సర్‌ను కట్టడి చేయవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

కాటూరి మెడికల్ కాలేజీలో ఏఆర్‌టీ సెంటర్



ఏఆర్టీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కామేశ్వరప్రసాద్, డాక్టర్ మంజుల

గుంటూరు మెడికల్: యాంటీ రిట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టీ) మందులు ప్రతిరోజూ క్రమంగా వాడటం ద్వారా హెచ్‌ఐవీ వైరల్ లోడ్ తగ్గించుకుని ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం కాటూరి మెడికల్ కాలేజీలో ఏఆర్‌టీ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఏఆర్‌టీ సేవలతో పాటుగా హెచ్‌ఐవీతో జీవించేవారికి ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స అందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల మాట్లడుతూ హెచ్‌ఐవీతో జీవించేవారు సమయానికి పౌష్టికాహారం తీసుకుని, మానసికంగా ప్రశాంతంగా జీవించాలన్నారు. రోగులకు ఏఆర్‌టీ మందులు అందజేశారు. క్రమం తప్పకుండా సీడీ 4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పెప్ఫార్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ హెపటైటిస్ బీ, సీ పరీక్షలు చేయించుకుని నెగిటివ్ వచ్చినవారు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు, కాలేజీ హాస్పిటల్ డీన్ డాక్టర్ వరప్రసాద్, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్‌రావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు, మైక్రో బయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శివలీల, సీడీసీ షేర్ ఇండియా సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ జయ కృష్ణా, షేర్ ఇండియా టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభు, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్న కుమార్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, పొన్నెకల్లు గ్రామము, డోరు నెం.8-9 కాపురస్తులు [illegible] ... 4280/1949, [illegible] ... 02 01 2024వ తేదీన పోయినవి. సదరు డాక్యుమెంటు నెం. 4280/1949, [illegible] 1949న [illegible] సెల్ [illegible]

ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు మేడూరి మార్క్ కుటుంబానికి పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి అందించిన రూ.5 వేల ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకులు బుధవారం అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 23వ వార్డుకు మార్క్ మృతి చెందారు. కుటుంబాన్ని పరామర్శించి సాయం అందించారు.

న్యూరాలజీ వార్డుకు ఎల్‌ఈడీ టీవీ బహూకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు రూ.2 లక్షల విలువ గల ఎల్‌ఈడీ టీవీని బుధవారం మా అడ్వాన్సస్ డయాగ్నస్టిక్ రీసెర్చ్ సెంటర్ అధినేత డాక్టర్ ఎం.ఆదినారాయణరావు అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ టీవీని లాంఛనంగా ప్రారంభించారు. వార్డుకు టీవీ బహూకరించిన డాక్టర్ ఎం.ఆదినారాయణరావును అభినందించారు. డాక్టర్ ఆదినారాయణరావును, డాక్టర్ కిరణ్‌కుమార్‌లను న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సుందరాచారి సన్మానించారు. డాక్టర్ అరుణ కుమారి, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.